# ఇలాంటి అమ్మలూ ఉన్నారు!

చంప

"కారు సంగతేం చేశావురా?" అడిగింది శాంతమ్మ.

ఆఫీసుకెళ్ళే హడావుడిలో వున్న కిరణ్- ఈవిడకు శాంతమ్మ అని ఎవరు పేరు పెట్టారోగానీ ఎక్కడ అడుగుపెడితే అక్కడే అలజడి.. అని గొణుక్కున్నాడు.

"జవాబు చెప్పడానిక్కూడా తీరిక లేదా? కారు ఇవ్వడం ఇష్టం లేదా?"

బుస్సుమందామె.

అమ్మతో పేచీ ఇదే. ఇష్టం లేని మాట ఎవరన్నా, ఇష్టంలేని పని ఎవరు చేసినా గొంతు పెంచి నానా రభస చేసి పరువు తీస్తుంది. చిన్నప్పటి నుంచి ఆమె ఆయుధం అదే. ఎమోషనల్ బ్లాక్ మెయిల్!

చిరాకు అణచుకుంటూ "రేపు షోరూంకెళదాం" అనేసి ఆఫీసుకు బయలుదేరాడు కిరణ్.

ఆఫీసులో ఉన్నంతసేపూ అతనికి ఆలోచనలే.

అమ్మ అన్నది ఒక కమ్మని మాట. కనిపించే దేవత అమ్మ. బిడ్డలందరిపై సమానంగా ప్రేమ వర్షించే కరుణామయి- అంటూ కవితలూ, గీతాలూ.

కానీ అవేమీ కిరణ్ అనుభవంలోకి రానే లేదు. అడిగినప్పుడల్లా డబ్బు ఇస్తున్న తనమీద కంటే జులాయిగా తిరుగుతున్న తమ్ముడి మీదనే అమ్మకు ప్రేమ!

తల్లి, తమ్ముడు తునిలో ఉంటున్నారు. అక్కడ తమకి రెండు భవనాలున్నాయి. వాటి మీద అద్దె మాత్రమే కాక అమ్మకు పెన్షన్ కూడా వస్తుంది. తను నెల నెలా పది వేలు యిస్తూనే ఉన్నాడు. కానీ అమ్మ ఆశకు అంతులేదేమో. టీవీ, బీరువా, ఫ్రిజ్, సోఫాలాంటివన్నీ కిరణ్ చేతనే కొనిపించింది. ఇప్పుడు కారు కావాలంటోంది!

తమ్ముడొక జులాయి వెధవ. మొదట యాభై వేలు డొనేషన్ కట్టి పెద్దాపురం ఇంజినీరింగ్ కాలేజీలో చేరినా ఎప్పుడూ కాలేజీకి వెళ్ళలేదు. ఇప్పుడు మరో యాభై వేలు డొనేషన్‌తో తుని ఇంజినీరింగ్‌లో చేరినా మళ్లీ అదే తంతు. ఆ ఖర్చులన్నీ కిరణ్‌వే. అమ్మ వాడిని మందలించకపోగా వెనకేసుకొస్తుంది. కారు అమ్మ కోసం కాదు. వాడు ఫ్రెండ్స్‌తో జల్సాగా తిరగడానికి!

విశాఖలో ప్రైవేటు కంపెనీలో అరవై వేల జీతగాడు తను! పేరుకి ఆఫీసరు. కానీ ఇంట్లో కనీస ఫర్నీచర్ కూడా లేదు. మిగిలిన ఆఫీసర్లు హాయిగా దర్జాగా ఉంటే ప్రతి నెలాఖరున తను డబ్బుకోసం వెదుకులాటే. పెళ్లయాక సమస్యలు పెరిగాయి గాని ఊరట లభించలేదు.

ooo

రాత్రి బెడ్‌రూంలో కారు విషయమై భార్య సలహా అడిగాడు.

"రెండు కొనండి. ఒకటి అమ్మకి. ఒకటి తమ్ముడికి!" అంది తేజస్విని. మాటలు మామూలుగా వినిపించినా మాటున కోపం బుసబుసలు. ఇంక కిరణ్ మాట్లాడలేదు. తేజా మాట్లాడలేదు. ఎవరి ఆలోచనలు వారివి.

కోటి కోరికలతో, శతకోటి కలలతో కొత్త కాపురంలో అడుగుపెట్టిన తేజస్విని అందరి మెప్పుకోసం కృషి చేసినా త్వరలోనే అదెంత కష్టమో తెలిసివచ్చిందామెకు.

అత్తగారెప్పుడు విశాఖకు వచ్చినా ఎంతో సంబరంగా ఆమె కోరినవి వండిపెట్టి కొనిపెట్టి సినిమాలకు, షికార్లకు తీసుకు వెళ్లేది తేజ. కానీ ఎంతో కాలం మంచిగా ఉండలేకపోయిన శాంతమ్మ ఏదో వంకన నానా రభస చేసి షాపుల్లో, సినిమాల్లో, వీధుల్లో కోడల్ని అవమానించి వికృతానందంతో నిజస్వరూపం వెల్లడించుకునేది.

మనవడు పుట్టాక చాలామందిలో మార్పు వస్తుంది కాని శాంతమ్మ తీరే వేరు. బారసాలకు మనవడికి ఒక్క ఉంగరమైనా ఇవ్వకపోగా బంధువులిచ్చిన బహుమతులు జాతీయం చేసేసింది. ఎదుగుతున్న మనవడి చేతిలో ఒక చాక్లెట్ అయినా పెట్టకపోగా వాడి బొమ్మలు తన సంచిలో దాచేసి తునికి పట్టుకుపోయేది.

"మధ్యలో నువ్వొచ్చి మింగుతున్నావుకానీ పెళ్లి చేయకపోతే అబ్బాయి జీతం అంతా నాదే అయేది" అంది ఒకసారి, తిండి పెడుతున్నందుకు కృతజ్ఞతగా పడి ఉండు అన్న ధోరణిలో.

తనకు జరుగుతున్న అవమానాల గురించి, కనీసం మనవడి మీద కూడా ప్రేమ చూపని అత్తగారి నైజం గురించి భర్తకు చెప్పుకునేది తేజ. అతనికి అమ్మ మీద ప్రేమో, భయమో-ఆమెకు వ్యతిరేకంగా ఏ నిర్ణయమూ తీసుకోలేడు, తీసుకున్నా ఆ నిర్ణయం మీద స్థిరంగా నిలబడలేని బలహీనత అతనిది. ఆ బలహీనతను సొమ్ము చేసుకుంటూ రెచ్చిపోతోంది శాంతమ్మ.

భర్తకు చెప్పి, చెప్పి సంవత్సరాలు గడుస్తున్నా ఫలితం లేక, భర్తలోను అత్తగారిలోనూ మార్పు రాక సైలెంట్ అయిపోయింది తేజ. భర్త ఏం అడిగినా, అత్తగారెంత అవమానించినా మౌనమే ఆమె భాష అయింది.

భార్యాభర్తల మధ్య కనిపించని గోడ మొలచి దినదినమూ పెరుగుతోంది.

ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగంలో చేరబోతూ ఆ విషయం భర్తకి చెప్పింది తేజ. నిర్ఘాంతపోయిన కిరణ్ "నీకు ఉద్యోగం అంత అవసరమా?" అని అడిగాడు.

"అవసరమే. నేను తింటున్న తిండికి డబ్బు చెల్లించవలసి రావచ్చు. ఉద్యోగం ఊడి మీరు రోడ్డున పడే రోజు రావచ్చు. భవిష్యత్తులో బాబు స్కూలు ఫీజు కూడా కట్టలేని స్థితిలో మీరు ఉండొచ్చు" నిర్లిప్తంగా చెప్పిందామె.

స్వయం నిర్ణయాలు తీసుకుంటున్న భార్యవైపు చూస్తూ ఉండిపోయాడు కిరణ్.

ooo

ఓ అర్ధరాత్రి భయంకరంగా మోగుతున్న ఫోన్ రొదకు ఉలికిపాటుగా లేచి ఫోన్ అందుకున్నాడు కిరణ్. అర్జెంట్‌గా రమ్మని భీమిలి పోలీస్ యస్సై ఆదేశం!

హడలిపోతూ భీమిలి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి నిర్ఘాంతపోయాడు కిరణ్.

నెలనెలా పెట్రోలు ఖర్చు కంపెనీ నుంచి రాబట్టవచ్చని తన పేరున వాయిదాల పద్ధతిలో కారు కొని అమ్మకిచ్చాడు కిరణ్. రెండు రోజుల క్రితం భీమిలి బీచ్‌లో ఆ కారులో ముగ్గురు యువకులు ఒక అమ్మాయిని బలవంతంగా తీసుకొచ్చి రేప్ చేశారు. అమ్మాయి అరుపులు విని పెట్రోలింగ్ పోలీసులు కారు వద్దకు రాగా యువకులు పారిపోయారు. అమ్మాయి ఆస్పత్రిలో కోలుకుంటోంది. కారు తన పేరున రిజిస్టర్ అయి ఉంది కాబట్టి పోలీసులు తనని అనుమానిస్తున్నారు.

కిరణ్‌కి ముచ్చెమటలు పట్టేశాయి. ఇది తమ్ముడి పనే అని అతనికి తెలుసు. కానీ చెప్పలేదు. కారు కొన్నది తనే అయినా తునిలో ఉన్న అమ్మకిచ్చానని, ఎవరో కారు దొంగిలించి ఈ పని చేసి ఉంటారని, తను పెద్ద కంపెనీలో గౌరవనీయ ఆఫీసర్ అని, ఇలాంటి పనులు చేసేవాడిని కాదని చెప్పుకున్నాడు కిరణ్.

ఆస్పత్రిలో కోలుకుంటున్న అమ్మాయి "ఇతను కాదు" అని చెప్పాక కిరణ్‌ని విడిచిపెట్టారు పోలీసులు.


ముఖం వేలాడేసుకుని ఉదయం ఏడు గంటలకు ఇల్లు చేరుకున్న భర్తని చూసినా మౌనంగా వంటపనిలో బిజీగా ఉండిపోయింది తేజ. జరిగిందంతా భర్త చెబుతోంటే పని చేసుకుంటూనే విన్నది కాని మాట్లాడలేదు.

భార్య నిర్లిప్తతకు కోపం వచ్చినా అదుపు చేసుకొని "ఏం చేయాలో తోచడం లేదు" అన్నాడు నిస్సహాయంగా.

నిశ్చలంగా అతని వైపు చూస్తూ "రెండే మార్గాలు. తమ్ముడి నేరం మీ మీద వేసుకొని జైల్లో కూర్చోడం లేదా లాయర్లకు లక్షలు గుమ్మరించి దొంగ సాక్ష్యాలు చెప్పించి తమ్ముడిని రక్షించడం" అంది.

"నా వద్ద అంత డబ్బు లేదు"

"అయితే జైల్లో కూర్చోండి. అబ్బో! తమ్ముడంటే




ఎంత ప్రేమ! అని అందరూ మెచ్చుకుంటారు"

ఏ భార్య అయినా అంత నిర్లిప్తంగా భర్తని జైలుకి పొమ్మంటుందా! నిర్ఘాంతపోయాడు కిరణ్. అతని భావం అర్థం చేసుకుంది కాబోలు కాసేపాగి-

"కలలు కనమని, వాటిని సాకారం చేసుకోమనీ సైకాలజిస్ట్‌లు చెబుతారు. వైవాహిక జీవితం గురించి మీరెన్ని కలలు కన్నారో, ఎన్ని సాకారం చేసుకున్నారో నాకు తెలియదు. కానీ నేను ఎన్నో కలలు కన్నాను. అత్త గారూ, మీరూ, తమ్ముడూ, నేనూ అన్యోన్యంగా ఉంటూ ఆదర్శకుటుంబంగా ఉండాలనీ సుఖశాంతులు వెల్లివిరియాలనీ బాబు, పాపా పుట్టాలనీ మంచి భార్యగా మంచి కోడలుగా మంచి తల్లిగా అందరి మన్ననలూ పొందాలని- ఎన్నో కలలు! కానీ నా కలలన్నింటినీ మీరు కాల్చి బూడిద చేశారు! నాలోని ప్రేమ, ఆర్ద్రత, సహనం నాశనం చేసేసి నన్నొక మోడుగా మిగిల్చారు. మనిద్దరి మధ్యా కనిపించని గోడ కట్టేశారు. మీకు తోచదు. చెబితే వినరు. నా సలహాలు అక్కరలేదు. నా భావోద్వేగాలతో పని లేదు. నా ఆశలూ, ఆశయాలూ, అవమానాలు మీకు పట్టవు. భార్యంటే మీ ఉద్దేశంలో రెండు ముద్దలు తిని ఇంటెడు చాకిరి చేసే పనిమనిషి! తల్లికి తమ్ముడికి తప్ప భార్యకేమీ ఇవ్వనక్కరలేదు. మీకు బిడ్డ భవిష్యత్తు కూడా పట్టదు. మానసికంగా మనం విడాకులు తీసుకున్నట్టే ఉంది నా బతుకు! అందువల్ల మీరు జైలుకెళ్లినా, మీ ఉద్యోగం ఊడినా, అప్పులపాలై మీరు రోడ్డున పడ్డా నాకేమీ బాధ ఉండదు" అంటూండగానే ఆమెకు దుఃఖం ముంచుకొచ్చింది. కన్నీళ్లు ఉబికాయి.

మాట్లాడుతూనే ఆమె లంచ్ బాక్స్‌లు సిద్ధం చేసి బాబుకి యూనిఫాం వేసి బూట్లు తొడిగింది. భార్య కన్నీరు ఎప్పుడూ చూడని కిరణ్ విచలితం అయినాడు. నిజానికి అతనెప్పుడూ ఆమె గురించి ఆలోచించనే లేదు. ఇప్పుడు చూస్తోంటే లోలోనే రగిలిపోతూ కన్నీళ్లు ఎగజిమ్ముతున్న అగ్నిపర్వతంలాగా ఉందామె.

సహకరించని భర్త సమక్షంలో కన్నీళ్లు వృథా చేయడం ఇష్టం లేక కాబోలు చటుక్కున కన్నీళ్లు తుడుచుకుని చరచరా బెడ్‌రూంకెళ్లి చకచకా ముస్తాబై ఒక లంచ్ బాక్స్ భర్తకిచ్చి రెండు బ్యాగ్‌లో వేసుకొని బాబు చెయ్యి పట్టుకొని గబగబా వెళ్లిపోయిందామె. బాబుని స్కూలులో విడిచి ఆఫీసుకు వెళ్లడం పరిపాటే.

స్థాణువై నిలబడిపోయాడు కిరణ్. భార్య చెప్పిన ప్రతి మాటా వాస్తవమే. తల్లి చేసే ఎమోషనల్ బ్లాక్ మెయిల్‌కి లొంగిపోయి భార్యాబిడ్డల సంగతే పట్టించుకోవడం లేదు తను. వాళ్లు అడిగినంతా ధారపోస్తూ ఉంటే తమ్ముడు చెడిపోవడమే కాక బాబు స్కూలు ఫీజు కూడా కట్టలేని పరిస్థితి వస్తుందని భార్య హెచ్చరిస్తూనే ఉన్నా తను పెడచెవిన పెట్టాడు. తమ్ముడు రేప్ చేసే స్థితికి దిగజారడానికి బాధ్యత అమ్మతో బాటు తనది కూడా. అతని హృదయంలో బాధ సుడులు తిరుగుతోంది.

○○○

భీమిలి యస్సై వచ్చి కంపెనీ యండీని కలిసి రేప్ గురించి, కారు గురించి వివరించి కిరణ్ వ్యక్తిత్వం గురించి వాకబు చేసి వెళ్లాడు.

దాంతో రేప్ వార్త ఆఫీసంతా పాకింది. కిరణ్ ఆఫీసులో అడుగుపెట్టగానే-

నీ కారుని నువ్వు కాక నీ తమ్ముడు వాడుకుంటూ ఉండగా కంపెనీ నుంచి పెట్రోలు ఖర్చులు డ్రా చేస్తు

న్నందుకు సంజాయిషీ కోరుతూ యండీ మెమో ఇచ్చాడు.

కిరణ్ గతుక్కుమన్నాడు. రూల్ ప్రకారం ఆ తప్పునకు శిక్ష బర్తరఫ్ లేదా హోదా తగ్గించి బదిలీ చేయడం! ఉచ్చులో చిక్కుకున్నట్టు విలవిలలాడిపోయాడు.

అంతలో అమ్మ నుంచి ఫోన్- ఇంటికొచ్చాను. వెంటనే రమ్మని.

ఆరోజుకి సెలవు పెట్టేసినా ఇంటికి వెళ్లడానికి మనస్కరించలేదు. అతని బాబాయి ఆ ఆఫీసులోనే అసిస్టెంట్ డైరెక్టర్..ఆయనే కిరణ్‌కి ఉద్యోగం ఇప్పించాడు. కిరణ్‌కి ఆయనంటే ఎంతో గౌరవం. తీరిక చేసుకుని రోజూ ఒక అరగంట ఆయనతో ఇంటి సమస్యలు చెప్పుకుంటాడు. ఆచరించకపోయినా ఆయన సలహాలు అడుగుతూ ఉంటాడు.

సెలవు పెట్టేసి ఇంటికి వెళ్లకుండా ఆయన్ని కలిశాడు కిరణ్. అతనిని చూస్తూనే ఆయన "నువ్వొక ఫూల్‌విరా కిరణ్! పెళ్లాం మాట విన్నా, నా సలహా పాటించినా నీకీ దుర్గతి పట్టేది కాదు. నువ్వు సిటీ బస్సులో ఆఫీసుకి వెళ్తూ తమ్ముడికి కారు ఇస్తే అందరూ పొగుడుతారనుకున్నావుగాని తమ్ముడు చెడిపోడానికి నువ్వే కారణం అని అందరూ తిడుతున్నారు తెలుసా? ప్రతి కొడుకూ అమ్మని ప్రేమించాలి. నిజమే కానీ ఆ ప్రేమ అబ్‌సెషన్‌గా మారితే అనర్థాలే! ఇప్పటికైనా మేల్కొని అబ్సెషన్ నుంచి బయటపడకపోతే నీ జీవితమే ఎడారి అయిపోతుంది జాగ్రత్త! అమ్మని ప్రేమించమంటే దానర్థం భార్యాబిడ్డల్ని నిర్లక్ష్యం చేయమని కాదు" దులిపేశాడు.

తలవంచుకుని కన్నీళ్లు పెట్టుకుంటున్న కిరణ్‌ని చూస్తే జాలివేసింది కాబోలు "నీ తప్పును చిన్న పనిష్‌మెంట్‌తో క్షమించమని యండీగారితో చెబుతానులే" అని ఓదార్చి "నా జీవితం సుఖంగా ఉండడానికి కారణం తెలుసా? జీతాన్ని మూడు భాగాలు చేసి ఒక భాగం అమ్మకిస్తాను. ఒకటి నా కుటుంబానికి, మిగిలినది బిడ్డల భవిష్యత్తు కోసం. ఎవరెంత అరిచి గీ పెట్టినా ఒక భాగం తగ్గించి ఇంకో భాగం పెంచే సమస్యే లేదు. నువ్వు కూడా అలా ప్రయత్నించు" సలహా ఇచ్చాడు.

చిదిగిన హృదయంతో ఇంటిలో అడుగుపెట్టగానే అప్పటికే హౌస్ ఓనర్ నుంచి తాళం చెవి తీసుకొని ఇంటిలో ఉన్న శాంతమ్మ "నా కోసం వంట చేయకుండా అదెక్కడ చచ్చిందిరా!" కోడలి మీద అరిచింది.

చేతిలోని లంచ్ బాక్స్ ఆమెకిచ్చేశాడు కిరణ్.

ఏ తల్లి అయినా తను పస్తులుండి పిల్లలకు భోజనం పెడుతుందంటారు. కొడుకు కడుపు మాడినా ఫర్వాలేదు తన కడుపు నింపుకుంటోంది ఈ తల్లి!

'అందరు అమ్మల లాంటిది కాదు మా అమ్మ' విరక్తిగా నవ్వుకున్నాడు కిరణ్.

ఆమె భోజనం చేస్తూనే పోలీసులు తమ్ముడికోసం వెదుకుతున్నారనీ, నువ్వే ఏదో ఒకటి చేసి వాడిని రక్షించాలనీ, వాడు బుద్ధిమంతుడే, ఆ పిల్లే వాడిని రెచ్చగొట్టి ఉంటుందనీ శోకాలు మొదలుపెట్టిందామె.

"దిట్టమైన లాయర్‌ని పెట్టి దొంగ సాక్ష్యాలు సృష్టించి తమ్ముడిని రక్షించవచ్చు. అందుకు లక్షలు కావాలి. నా వద్ద డబ్బు లేదు. ఇన్‌కంటాక్స్ వాయిదాలు కట్టవలసి రావడంతో కారు వాయిదాలు రెండు కట్టలేదు. కారు పట్టుకుపోతామని బ్యాంకువాళ్లు ఫోన్ చేస్తున్నారు. పైగా నా ఉద్యోగం ఊడేటట్టుంది" బేలగా అన్నాడు కిరణ్.

ఆమె నమ్మలేదు. కిరణ్‌కి కోపం వచ్చింది. ఇంతకు ముందు కూడా చాలా సార్లు కోపం వచ్చింది. అయినా గొంతులో ఏదో అడ్డుపడినట్లు తన కోపాన్ని వ్యక్తం చేయలేకపోయేవాడు. ఫలితంగా లొంగిపోయేవాడు.

కానీ ఇప్పుడు ఆ బలహీనత నుంచే ఏదో జవం, జీవం తోసుకొస్తున్నట్లు, ఇంతవరకూ గొంతులో అడ్డుపడుతూ తనని బలహీన పరిచిన అడ్డంకి తొలగిపోయినట్లూ అనిపించింది. "నా వద్ద డబ్బు లేదు. కొడుకు కోసమైనా నీ వద్దనున్న మూట లోంచి డబ్బు తీయడం నీకిష్టం లేదు. పోనీ తమ్ముడి నేరాన్ని నా మీద వేసుకొని నేను జైలుకి పోయి తమ్ముడిని రక్షించనా?" మృదువుగానే అడిగాడు.



అయితే ఆ మృదుత్వంలోనే ఏదో కాఠిన్యం, దృఢ సంకల్పం గోచరించి నోటిలో వేలుపెడితే కొరకలేని కొడుకు ఇప్పుడు కటుక్కున కొరికేసినట్లనిపించి నిర్ఘాంతపోయింది శాంతమ్మ. కాసేపటికి తేరుకొని- బాబాయిని అప్పు అడగవచ్చు కదా అంది.

"కారు వాయిదాలే తీర్చలేని పరిస్థితిలో కొత్త అప్పులెలా తీర్చగలనమ్మా!" పుట్టి బుద్ధెరిగిన తర్వాత జీవితంలో మొదటిసారి ధైర్యంగా మనసులోని మాట తల్లికి చెప్పాడు కిరణ్. అంతటితో ఆగలేదు.

అడ్డంకి తొలగిపోగానే గొట్టంలోంచి నీళ్ళు ఎగజిమ్ముతున్నట్లు పెల్లుబికిన ఆత్మవిశ్వాసంతో "తమ్ముడిని రక్షించే బాధ్యత నాదే గానీ నీది కాదా అమ్మా! నా అంచనా ప్రకారం నీ వద్ద ముప్ఫయి లక్షలు పైగా ఉండాలి. అవసరానిక్కూడా ఖర్చుపెట్టకుండా ఏం చేసుకుంటావమ్మా ఆ డబ్బు? నామీద కంటే తమ్ముడి మీదనే నీకు ప్రేమ ఎక్కువ. పోనీ నేనే తమ్ముడి బదులుగా జైలుకి పోతానులే!" అన్నాడు.

దిగ్భ్రాంతిగా కొడుకు ముఖంలోకి చూస్తూ ఉండిపోయింది శాంతమ్మ.

ఆమెకా క్షణంలో అర్థం అయిపోయింది-కిరణ్ తన గుప్పిట దాటి పోయాడని. ఇకపై వాడి ముందు తన ఎత్తులు, ఎమోషనల్ బ్లాక్‌మెయిలింగ్ సాగవని. అంతే. చివాలున లేచి తునికి బయలుదేరింది డబ్బు తీసుకురావడానికి.

"నా చేతగాని తనంతో నా నిర్లక్ష్యంతో నిన్ను మోడుగాను, మన జీవితాన్ని మరుభూమిగాను మార్చివేసిన నన్ను క్షమించు తేజీ! నా తప్పు తెలుసుకున్నాను. ఇకపై గట్టి నిర్ణయాలు తీసుకుంటాను. నీకు బాసటగా నిలబడతా. నువ్వు కలలు కన్న ఆదర్శకుటుంబాన్ని సాకారం చేస్తాను" అనుకున్నాడు కిరణ్ కొత్తగా బయటపడ్డ ఆత్మవిశ్వాసంతో.

## ఉద్యోగం చేస్తున్న అదితి

ఆర్తీ అగర్వాల్ చెల్లెలు అదితి అగర్వాల్ కూడా టాలీవుడ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకుని ఫెయిలైంది. తొలి చిత్రం 'గంగోత్రి' హిట్టయినా ఆమెకి అవకాశాలు కరువయ్యాయి. మలి చిత్రం 'కొడుకు' పరాజయంతో ఇక ఆమె సినీకెరీర్‌కి బ్రేక్‌పడినట్టే అని ఆమె కూడా భావించినట్టుంది. తాజా సమాచారం ఏంటంటే- అదితి అమెరికా వెళ్లిపోయి అక్కడే ఓ ఉద్యోగంలో సెటిలైందిట. అవును మరి, ఎందుకొచ్చిన తిప్పలు, హాయిగా వుద్యోగం చేసుకోవడం బెటర్ అనుకున్నట్టుంది అదితి. శుభం!